క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



తాడూరు: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డును అనుసరించుకుని నిర్వహిస్తున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు చేసే పనులపై అవగాహన కల్పించారు. కూలీల సంఖ్యను పెంచడంతో పాటు పనుల నిర్వహణ, గ్రామసభలో ఎంపిక చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని క్షేత్ర సహాయకులు శర్మకు సూచించారు. గ్రామసభలో పనుల వివరాలను ప్రజలకు వివరించాలని తెలిపారు.

వరికొనుగోలు కేంద్రం ప్రారంభం



పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో ఐకేపీ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ నల్లపోతుల గోపాల్ బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం అన్ని చర్యలు తీసుకుందన్నారు. క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకం రూ.2203లు, బి గ్రేడ్ రూ.2183లకు మద్దతు ధర ఇస్తున్నామన్నారు. వానాకాలం పంట వడ్లు కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, ఏపీఎం గౌసుద్దీన్, ఈసీ శోభారాణి, ఎల్లగౌడ్, రాము, మహిళా సమాఖ్య సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కల్వకుర్తిరూరల్: వైద్య విద్యను అభ్యసిస్తున్న శిశ్వరక్షణకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేల ఆర్థికసాయ అందజేశారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు భార్య రాజేశ్వరి పుట్టినరోజు సందర్భంగా చెక్కు అందజేశారు. విద్యార్థి విద్య కోసం సహాయం చేయాలని క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్ రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యదర్శి కల్మిచర్ల రమేష్, రాంరెడ్డిపల్లి ఎంపీటీసీ గోపాల్, లక్ష్మీనరసింహారావు, రాజేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె



గోపాల్‌పేట: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేందుకు మంగళవారం నుంచి ప్రారంభమైన తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారం కొనసాగింది. 8గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని చెప్పారు.

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నాయకులు



కల్వకుర్తిరూరల్: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు బాబిదేవ్‌తో పాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుత రాజకీయ అంశాలను మండల నాయకులు బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు.

నిర్మాణాలు పూర్తయ్యేనా?

- ఆరుబయట గ్రామసభలు
- పట్టించుకోని అధికారులు



పునాది లెవల్‌లో పెరుమాండ్లపల్లిలో గ్రామ పంచాయతీ భవనం

పెద్దకొత్తపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీలకు నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరైనా స్థలం లేక నిర్మాణాలు చేపట్టలేదు. పక్కా భవనాలు లేక గ్రామసభలు ఆరుబయట నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. గత పాలకులు అన్ని గ్రామాల పంచాయతీలకు సొంత భవనాలు నిర్మిస్తామని ఇచ్చిన హామీలు నీటిమీద రాతలులాగే మిగిలాయని సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. మండలంలోని చంద్రబండ తండా, నక్కలపల్లి, పెరుమాండ్లపల్లి, దేదినేనిపల్లి, కొత్తయాపట్ల, కల్వకోలు, చిన్నకార్పాముల, పెద్దకొత్తపల్లి, తిర్నాంపల్లి గ్రామాలలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టలేదు. ఒక్కొక్క గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.22 లక్షలు మంజూరు చేసినా స్థలాలు లేక తిర్నాంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభకాలేదు.

బేస్‌మెంట్ లెవల్‌లో పంచాయతీ భవనాలు

చంద్రబండ తండా, నక్కలపల్లి, పెరుమాళ్లపల్లి గ్రామాల్లో బేస్‌మెంట్ లెవల్‌లోనే నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. పెద్దకొత్తపల్లిలో కూడా గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం భూమి పూజ చేసి కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈజీఎస్ ద్వారా ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ.22 లక్షల మంజూరైన నిర్మాణాలు చేపట్టలేదు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో మాట్లాడి అసంపూర్తి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణాలను వెంటనే చేపట్టాలి



మండలంలోని చంద్రబండ తండా, నక్కలపల్లి, కొత్తయాపట్ల, కల్వకోలు, చిన్నకార్పాముల, పెద్దకొత్తపల్లి, తిర్నాంపల్లి గ్రామాలలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలను అసంపూర్తిగా ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయించాలి. దీంతో ప్రజలకు గ్రామ పంచాయతీలలో స్వపరిపాలన అందుతుంది.

– శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



మండలంలో పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పనులు వేగవంతం చేసేలా కాంట్రాక్టర్‌కు ఆదేశిస్తాం. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల సర్పంచులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

– కృష్ణయ్య, ఎంపీడీఓ, పెద్దకొత్తపల్లి

రైతులకు అందుబాటులో ఉంటా



గగ్గలపల్లిలో పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గగ్గలపల్లి శివారులో ఉన్న శ్రీకృష్ణా కాటన్ మిల్లును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో రైతులకు సరైన ధర కల్పించాలని మిల్లు యజమానులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని యజమానులకు సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటానని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆయన వెంట దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి, కొండా నాగేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కందనూలు: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రామ్‌నగర్ కాలనీ రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వరదరాజన్ అయ్యంగార్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని బుధవారం తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దెంది రాజారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఆయనను శాలువాలతో సన్మానించారు. జిల్లా బాధ్యులు వెంకట్, నాగరాజు, కృష్ణారెడ్డి, నిరంజన్, జగదీష్‌రెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, లక్ష్మీరెడ్డి, వేముల సురేష్, తిరుపతిరెడ్డి, శ్రీనివాసచారి, పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

తాడూరు: పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలు నూతన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ గోపాల మిత్రులకు పే స్కేల్ వర్తింప చేసి శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని కోరారు. ఎనిమిది నెలలుగా బకాయి ఉన్న జీతాలను చెల్లించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రులు నిరంజన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన బిరుదు శ్రీనువాసు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి బుధవారం గౌరారం చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేసి ఓదార్చారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కూతురు ఉన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సుమిత్ర, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఔదార్యం

అమ్రాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి హరీష్ తండ్రి మాచారంకు చెందిన లెంకల శ్రీనివాసులు ఇటీవల మృతి చెందాడు. తోటి విద్యార్థులంతా కలిసి డబ్బులను పోగు చేసి బుధవారం హరీష్ కుటుంబానికి రూ.6000 ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు, అనీల్‌కుమార్, తుకారాం, విద్యార్థులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఉప్పునుంతల: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను బుధవారం అచ్చంపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మల్లయ్య, బాలపీర్, లక్కీరాం, రమేష్, రాము తదితరులు ఉన్నారు.

భక్తులకు అన్నదానం



లింగాల: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. భజన మండలి ఆధ్వర్యంలో అఖండ భజన నిర్వహించారు. కార్యక్రమంలో మాకం శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయసుధ

చారకొండ: నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయా గ్రామాల అధికారులతో ఎంపీడీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులతో గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, వాటి అభివృద్ధిపై సమీక్షించారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీల పేమెంట్, ఆధార్ సీడింగ్ వివరాలపై ఎప్పటికప్పుడు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నును వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య చర్యలపై అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీఓ వెంకటేష్, ఏపీఎం లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న ఎంపీఓ సునీత

వెల్దండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీఓ సునీత పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులు, మొక్కల పెంపకాన్ని సక్రమంగా చేపట్టాలన్నారు. అదేవిధంగా తాగునీరు సరఫరా సక్రమంగా చేయాలన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయమణెమ్మ

అచ్చంపేట రూరల్: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని సూపర్‌వైజర్ విజయమణెమ్మ, కౌన్సిలర్లు సునీతారెడ్డి, సంధ్య అన్నారు. బుధవారం పట్టణంలోని 10, 11వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారాన్ని వారు అందజేశారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటమ్మ, ఉమాదేవి పాల్గొన్నారు.

ఆత్మకూర్ ఎంపీపీపై అవిశ్వాసం

- రెండ్రోజుల్లో ఎంపీటీసీలకు నోటీసులు ఇస్తామన్న ఎంపీడీఓ
- తదుపరి ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎవరన్న దానిపై చర్చ

ఆత్మకూర్: స్థానిక ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యులు అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మండలంలో ఏడుగురు ఎంపీటీసీ సభ్యులున్నారు. ఎంపీపీ బంగారు శ్రీనివాసులు (బీఆర్‌ఎస్) పిన్నంచర్ల ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కోటీష్ (బీఆర్‌ఎస్) ఆరేపల్లి, శ్యామల (బీఆర్‌ఎస్) మూలమళ్ల, అలివేలు బీసన్న (బీఆర్‌ఎస్) రేచింతల, శారద సోమాంజి (బీఆర్‌ఎస్)దేవరపల్లి, పరమేష్ (కాంగ్రెస్) జూరాల, సుచిత్ర (కాంగ్రెస్) తిప్పడంపల్లి ఉన్నారు. ఇటీవలే రేచింతల ఎంపీటీసీ అలివేలు, దేవరపల్లి ఎంపీటీసీ శారద ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం నాలుగుకు చేరింది. సోమవారం నలుగురు కాంగ్రెస్ ఎంపీటీసీలు అదనపు కలెక్టర్ తిరుపతిరావును కలిసి ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ వినతిపత్రం అందజేశారు. కాగా ఈ విషయమై మండలంలో చర్చ జోరుగా సాగుతోంది. అవిశ్వాసం నెగ్గి తదుపరి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఎవరు అవుతారని చర్చ కొనసాగుతుంది. జూరాల ఎంపీటీసీ పరమేష్ ఎంపీపీగా, తిప్పడంపల్లి ఎంపీటీసీ సుచిత్ర వైస్ ఎంపీపీ అయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రెండ్రోజుల్లో ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు అందజేస్తామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

అర్హులైన ఓటర్లను గుర్తించండి



వీపనగండ్ల: గ్రామాలలో అర్హులైన ఓటర్లను గుర్తించడంలో బీఎల్‌ఓలు జాగ్రత్త వహించాలని తహసీల్దార్ వరలక్ష్మి ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల అవగాహన సదస్సును నిర్వహించారు. మృతి చెందిన ఓటర్లను, డబుల్ నమోదైన వారి వివరాలను సేకరించాలని తెలిపారు. జనవరి 1, 2024వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటర్లుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకుని అందుకు సంబంధించిన పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కురుమూర్తి, బీఎల్‌ఓలు సుగుణాబాయి, కృష్ణమ్మ, పారిజాత, మహేశ్వరి, వరాలు, గోవిందమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మకమైన విద్యనందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ రామారావు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ రామారావు కోరారు. బుధవారం మండలంలోని ఏజెన్సీ ప్రభుత్వ పాఠశాలలను మండల నోడల్ అధికారి జీవన్‌కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సందర్శించారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌కు సంబంధించిన పత్రాలు, బేస్‌లైన్ టెస్ట్, ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రకారం విద్యార్థుల వివరాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు, హాజరు పట్టిక, అడ్మిషన్ రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ హన్మంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌పై దాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యం



నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ కార్యకర్తలు

తాడూరు: పార్లమెంట్‌పై దాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. బుధవారం మండలంలోని అంతారంలో అంగన్‌వాడీ భవనం ఎదుట కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభనే రక్షించలేని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ఎలా కాపాడుతుందని ప్రజలను ఎలా రక్షిస్తుందని ఆయన ప్రశ్నించారు. దాడి ఘటనపై సమగ్ర విచారణ చేసి దాడికి బాధ్యులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు మహేష్, అనిల్, నరేందర్, ఆంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లికి ఘన సన్మానం



మంత్రి జూపల్లిని సన్మానిస్తున్న యోగా కమిటీ సభ్యులు

కొల్లాపూర్ రూరల్: నూతనంగా ఎక్సైజ్ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన జూపల్లి కృష్ణారావును ఆయన క్యాంపు కార్యాలయంలో పట్టణ యోగా అధ్యక్షుడు అర్జున్ గౌడ్ ఆధ్వర్యంలో యోగా టీం సభ్యులు శాలువాలతో సన్మానించారు. ప్రస్తుత పరిస్థితులలో యోగా చాలా ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. యోగా ప్రదర్శనకు అన్ని విధాల సహకరిస్తానని భరోసా ఇచ్చారు. అదే విధంగా కొల్లాపూర్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ మంత్రిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యోగా సభ్యులు, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కోడేరు: మండల కేంద్రానికి చెందిన కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌యాదవ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రిని పూల బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, యాపట్ల నిరంజన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి



గుంతలమయంగా ఎంగంపల్లి రోడ్డు

తాడూరు: మండలంలోని ఎంగంపల్లి నుంచి ఆకునెల్లికుదురు వరకు ఉన్న మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. మొత్తం 3 కిలోమీటర్ల దూరం రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. గుంతలు ఏర్పడటంతో ప్రయాణించేందుకు వీలులేకుండా పోయిందని వాహనదారులు వాపోతున్నారు. వర్షకాలంలో అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఉంటు ఎలా ప్రయాణించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆకునెల్లికుదురు గ్రామాన్ని అనుసరించుకొని సీసీరోడ్డు వేసి దాదాపు ఒక కిలోమీటరు అసంపూర్తిగా వదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీటి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మట్టి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

కొల్లాపూర్ రూరల్: మండలంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు వేదికల దగ్గర దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లింగాల: ఈ ఏడాది జూన్ 26 తర్వాత కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకాలు వచ్చిన రైతులు మండలంలో 316 మంది ఉన్నారని ఏఓ నాగార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెంట్లవెల్లి: మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ముగిసిన విద్యార్థుల వివరాల పరిశీలన



విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న సభ్యులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పదో తరగతి విద్యార్థుల డేటా (నామినల్ రోల్) వివరాల పరిశీలన బుధవారంతో ముగిసినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. ఎమ్మార్సీ భవనంలో పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థుల డేటా వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పబ్లిక్ పరీక్షల నిమిత్తం సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరిశీలన టీం లక్ష్మీనారాయణ, వెంకటేష్, మోహన్, చంద్రశేఖర్, గోవింద్, జగన్, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.